క్లుప్తంగా

నేడు వాహనాల వేలం


ఎస్సై మౌనిక

పెద్దాపురం: వివిధ కేసుల్లో పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ వాహనాలను మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 20 వాహనాలను బహిరంగ వేలం వేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో.తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఉదయం స్వామివారి ప్రసాద వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ దేవస్థానం నుంచి ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, భాస్కర్, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండలంలోని చంద్రంపాలెంలో ఉన్న ఉప్పరగూడెం హైస్కూల్‌ను ఆయన సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులపై ఆరా తీశారు. ఉప్పరగూడెం హైస్కూల్ మండలానికి ఆదర్శ పాఠశాలగా ఉందని, ఆ గుర్తింపు కొనసాగేలా నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు, ఎక్కువ గ్రేడ్–ఎలు వచ్చేలా విద్యార్థులు శ్రమించాలన్నారు. ఈ మేరకు ఆయా సబ్జెక్టులపై శ్రద్ధ చూపడంతో పాటు, చేతిరాతపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. అంతకుముందు నవర హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

సామర్లకోట: జిల్లా మహిళా సమాఖ్య సమావేశం మంగళవారం స్థానిక సాంకేతిక శిక్షణ, అభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)లో నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం ఇన్‌చార్జి దుర్గారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాలోని 20 మండలాల సమాఖ్య ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని వివరించారు. మండల సమాఖ్యల అభివృద్ధిపై డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ కె.శ్రీరమణి సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సమాఖ్య కార్యదర్శి కె.సంధ్యారాణి, ఉ పాధ్యక్షురాలు జి.కాంతం, సహాయ కార్యదర్శి వి.నూకరత్నం, కోశాధికారి డి.నీలిమ పాల్గొంటారన్నారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా–1:	పుష్ప–2
లలితా–2:	పుష్ప–2
వీరభద్ర:	సీ202
శోభా:	పుష్ప–2
సామర్లకోట	
జయలక్ష్మి–1:	పుష్ప–2
జయలక్ష్మి–2:	పుష్ప–2
విఘ్నేశ్వరా:	పుష్ప–2
ఉప్పాడలో	
శ్రీనివాస థియేటర్	పుష్ప–2

ఉద్యాన సాగు.. లాభాలు బాగు

- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- సబ్సిడీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 2370 హెక్టార్లలో సాగు


రైతులకు అవగాహన కల్పిస్తున్న పిఠాపురం ఉద్యాన శాఖ అధికారులు

పిఠాపురం: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు సాధించేలా అధికారులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని రైతులు ఉద్యానసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలో 2370 హెక్టార్లలో రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందించి ప్రోత్సహిస్తోంది. పలువురు రైతులు ఉద్యాన సాగు ద్వారా అధిక దిగుబడులు, లాభాలు ఆర్జిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ఉద్యాన సాగు వైపు మళ్లుతున్నారు. కాగా అధికారులు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి ఉద్యాన సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు వివరిస్తున్నారు.

ప్రోత్సాహకాలు ఇలా..

కోల్డ్‌రూమ్: 30 మీటర్ల కెపాసిటీ గల కన్వెన్షన్ మోడల్ రూమ్, 10 మీటర్ల సోలార్ కోల్డ్‌రూమ్‌లకు యూనిట్ పెట్టుబడి రూ.15 లక్షలు కాగా సబ్సిడీ రూ.5.25 లక్షలు, 35 శాతం రాయితీ ఇస్తున్నారు.

కొలియేషన్ సెంటర్లు: 2400 స్క్వేర్ అడుగులు ఉండే షెడ్‌లు నిర్మాణానికి (కూరగాయలు, పండ్లు క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్‌లకు ఉపయోగించుకోడానికి) యూనిట్ పెట్టుబడి రూ.15 లక్షలు కాగా సబ్సిడీ రూ.6 లక్షలు, 40 శాతం రాయితీ ఇస్తున్నారు.

- **మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లు:** జీడిమామిడి, మామిడి పంటలు ప్రోసెసింగ్ చేసుకోడానికి యూనిట్ పెట్టుబడి రూ.25 లక్షలు అవుతుండగా సబ్సిడీ రూ.10 లక్షలు ఇస్తున్నారు.
- **శాశ్వత పందిర్లు:** పందిరి కూరగాయల పెంపకానికి ఒక యూనిట్ పెట్టుబడి రూ.2 లక్షలు అవుతుండగా సబ్సిడీ రూ.లక్ష ఇస్తున్నారు
- **ఆయిల్ పామ్:** ఎకరానికి 57 మొక్కలు నాటాల్సి ఉంది. మొక్కలకు రూ.11 వేలు, ఎరువులకు మొదటి నాలుగేళ్లు రూ.8400, అంతర పంటలు సాగుకు మొదటి నాలుగేళ్లు రూ.8400, మొత్తం రూ.27,800 ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు ఎండుగడ్డి, జీడిపప్పు, జామ, బొప్పాయి తదితర పంటల సాగు ప్రోసెసింగ్‌కు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఉద్యాన పంటలకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి పోత్సాహకాలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వెంటనే తమ సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి ప్రోత్సాహకాలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. జీడిమామిడి పంటకు హెక్టారుకు బీమా మొత్తం రూ.75 వేలు కాగా దానిలో 5 శాతం రూ.1500 రైతులు ప్రీమియంగా చెల్లించారు. ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ మధ్యలో జీడి మామిడి పంటలకు నష్టం వాటిల్లితే ఎకరానికి రూ.30 వేలు నష్ట పరిహారం అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఉద్యాన పంటలను ప్రోత్సాహించడానికి రాయితీలు కల్పిస్తున్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కె.సత్యశైలజ, ఉద్యానశాఖాధికారి, పిఠాపురం

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నారావు సోమవారం తెలిపారు. గ్రామసభ నిర్వహించే రోజున గ్రామ సచివాలయం ద్వారా అందించే సేవలు, ధ్రువీకరణ పత్రాలకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. గ్రామంలోని సమస్యలపై అర్జీలు దాఖలు చేయవచ్చన్నారు. 10న అమీనాబాద్, 11న గొర్స, 12న ఇసుకపల్లి, 13న కొమరగిరి, 17న కొండెవరం, 18న అమరవిల్లి, 19న కొత్తపల్లి, 20న కుతుకుడుమిల్లి, 21న మూలపేట, 23న నాగులపల్లి, 24, 27న పొన్నాడ, 28న రమణక్కపేట, శ్రీరాంపురం, 31న ఉప్పాడ, జనవరి 2న సుబ్బంపేట, 3న వాకతిప్ప, 4న యండపల్లి గ్రామాల్లోరెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

12 నుంచి సామర్లకోటలో..

సామర్లకోట: మండలంలో ఈ నెల 12వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా 12న ఉండూరు, 13న పనసపాడు, కొప్పవరం, 16న మాధవపట్నం, 17న పంద్రవాడ, 18న పవర, 19న నవర, 20న కాపవరం, 21న పి.వేమవరం, 23న వీకే రాయపురం, బోయనపూడి, 24న జి.మేడపాడు, 26న పీబీ దేవం, 27న వేట్లపాలెం గ్రామాల్లోని సచివాలయాల్లో జరుగుతాయని వివరించారు., 28న జగ్గమ్మగారిపేట గ్రామసభ హుస్సేన్‌పురంలోను, 30న సామర్లకోట, బీమవరంల్లో గ్రామ సభ రాజీవ్ గృహకల్పలో జరుగుతాయని చెప్పారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

ఎంఈఓ–2 పుల్లయ్య


కరాటే పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో ఎంఈఓ–2 పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడాలపైనా ఆసక్తి చూపాలని ఎంఈఓ–2 పి.పుల్లయ్య అన్నారు. మండలంలో వివిధ పాఠశాలల తనిఖీలో భాగంగా అచ్చంపేటలోని యూపీ స్కూల్‌ను సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అనేక మంది విద్యార్థులు కరాటే పోటీల్లో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించారని తెలుసుకుని పుల్లయ్య వారిని అభినంధించారు. చదువుతో పాటు, ఆటలపై దృష్టి పెట్టడం ద్వారా మానసిక ప్రశాంత, ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. అంతకుముందు పంద్రవాడ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల పుస్తకాలు, హోమ్ వర్కులను పరిశీలించారు. విద్యార్థులలో రీడింగ్ ఎబిలిటీ, గణితంలోని నాలుగు ఫండమెంటల్ ఆపరేషన్లను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఏ–1 ఎగ్జామ్‌కు సంబంధించి సిలబస్ ఎలా పూర్తి చేశారో ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలు, విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీవన విధానానికి రామాయణం దోహదం

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

సామర్లకోట: ప్రతి వ్యక్తి జీవన విధానాన్ని అవగాహన చేసుకోవడానికి రామాయణం దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో రామాయణంపై నిర్వహించిన టాలెంట్ టెస్టులో విజేతలైన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, విద్యార్థులందరూ రామాయణాన్ని చదవాలన్నారు. తెలుగులో అనేక గ్రంథాలున్నాయని, వాటిని చదవడంతో పాటు, రచయితల జీవిత విశేషాలను తెలుసుకోవాలని చెప్పారు. పోటీ పరీక్షలను తరుచూ ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆధ్యాత్మిక అంశాలను తెలుసుకోవాలన్నారు. పోటీల వలన విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం యు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పరీక్షను పర్యవేక్షించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

రికార్డులను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్


ఉండూరు రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ భావన

సామర్లకోట: మండలంలోని రైతు సేవా కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ భావన సోమవారం తనిఖీ చేశారు. ఉండూరు గ్రామంలోని రైసు మిల్లును జాయింట్ కలెక్టర్ ఆదివారం తనిఖీ చేసిన సమయంలో రైతు పొలం నుంచి ధాన్యం వాహనం బయలుదేరి 24 గంటలు గడిచినా అన్‌లోడ్ కావడం లేదని గమనించారు. ఈ సమయంలో రైతు సేవా కేంద్రం నుంచి వాహనం బయలు దేరకుండా.. బయలు దేరినట్టు రికార్డు చేయడాన్ని గుర్తించారు. దీంతో జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ భావన ఈ తనిఖీలు నిర్వహించారు. ఉండూరు, నవర రైతు సేవా కేంద్రాల రికార్డులను పరిశీలించారు. జీపీఎస్ ప్రకారం వాహనం లోడ్ అయిన తరువాత పరిశీలించాలన్నారు. రైతు సేవా కేంద్రంలో రికార్డు అయిన వాహనం మిల్లుకు సకాలంలో చేరే విధంగా కస్టోడియన్ అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏఓ ఐ.సత్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఫ్లైఓవర్‌పై మొరాయించిన వ్యాన్


సామర్లకోట ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన వ్యాన్‌ను తోస్తున్న ఎస్సై గరగారావు

భారీగా స్తంభించిన ట్రాఫిక్


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న సిబ్బంది

సామర్లకోట: సాంకేతిక లోపంతో స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం ఓ వ్యాన్ నిలిచిపోయింది. కాకినాడ నుంచి వస్తున్న ఈ వ్యాన్ నిలిచిపోవడంతో వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా ప్రదేశానికి చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొరాయించిన వ్యాన్‌ను ఎస్సై గరగారావుతో పాటు, మరికొందరు బ్రిడ్జి దిగువ వరకు తోసుకెళ్లారు. సోమవారం రాత్రి ఫ్లై ఓవర్ నాలుగువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ పి.కృష్ణభగవాన్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రాత్రి 9 గంటల వరకూ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకునే ఉన్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: వాహనా చోదకులు, ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మండలంలోని ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వాహన చోదకులకు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు ముగిసే సమయంలో యువకులు రోడ్డుపై అతి వేగంగా వెళితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌లు, బండికాగితాలు తప్పనిసరిగా తమతో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు విధిగా నంబర్లు ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు సమయంలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో కూలీలను ఎక్కిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వాటిని పూర్తి నియంత్రిస్తామని తెలిపారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపలి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమానాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512

సర్వ మానవాళికి మార్గదర్శి ఏసు క్రీస్తు


వేడుకలకు హాజరైన క్రైస్తవులు


ఐక్య క్రిస్మస్‌లో ప్రసంగిస్తున్న జాన్ వెస్లీ

పెద్దాపురం: సమస్త మానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనని పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. మండల ఫాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐక్య క్రిస్మస్ వేడుకలు సోమవారం సాయంత్రం స్థానిక లూథరన్ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన సువార్త సభలో జాన్ వెస్లీ మాట్లాడారు. క్రీస్తు పరిశుద్ధ ఆచరణలో ప్రతి ఒక్కరూ నడచుకోవాలన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల సంఘ క్రైస్తవ సోదరులు ఆలపించిన క్రైస్తవ గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జీవీ రత్నం, ట్రెజరర్ ఐ.ప్రేమరాజు, ఉపాధ్యక్షులు నవజీవనరాజు, జాయింట్ సెక్రటరీ పి.ఆనంద్, బి.యేసేపు, కె.సత్యానందం, సీ.డేవిడ్ రాజ్, పి.ఆనందకిషోర్, రాజేష్‌నోబుల్, రాణి ప్రసాద్, పాస్టర్లు పాల్గొన్నారు.

మాలల ఐక్యతను చాటి చెప్పాలి

ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు


నియోజకవర్గ మాలల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: సమాజానికి మాలల ఐక్యతను చాటి చెప్పడానికి ఈ నెల 15న గుంటూరులో జరిగే మల మహా గర్జనను విజయవంతం చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాల నాయకుల సలహాలను స్వీకరిస్తామన్నారు. ఆయా గ్రామాలను కాపాడేది మాలలేనని అన్నారు. మంద కృష్ణ మాదిగ మాలలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు కుల వృత్తి లేదని, మాదిగలకు చేతి వృత్తి ఉందన్నారు. మాలల ఐక్యతతో వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీసుకువెళ్లాలన్నారు. రాజకీయాలకు అతీతంగా మాలలు ఐక్యంగా ఏకం కావాలని కోరారు. ఆంధ్ర మాల మహానాడు అధ్యక్షుడు లింగం శివప్రసాద్ మాట్లాడుతూ, మాలలంటే ప్రతి ఒక్కరికీ చిన్న చూపుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, మాల మహానాడు నాయకులు పి.భగవాన్, పిట్టా జానకిరామారావు, అందుగుల జార్జిచక్రవర్తి, వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాలల ఐక్య వేదిక కమిటీని ఏర్పాటు చేశారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె


పెద్దాపురంలో సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు


సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు


పిఠాపురంలో ఆందోళన చేస్తున్న సిబ్బంది

పెద్దాపురం: మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర నాగేశ్వరరావు, కేవీ రమణ మాట్లాడుతూ, టెక్నికల్ కార్మికులు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలని కోరారు. 15 ఏళ్ల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు రూ.పది లక్షలు, అంగ వైకల్యం కలిగితే రూ.ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, బాలు, రామకృష్ణ, బషీర్, పాపారావు, శ్రీను, సాయి, వీరభద్రరావు, రాజు తదితరులు పాల్గొన్నారు,

జీతాలు పెంచాలని డిమాండ్

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయంలో గత పాతికేళ్లుగా పని చేస్తున్న వారికి జీతాలు పెంచాలని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు సోమవారం కార్మికులు సమ్మెలోకి దిగారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలను గడుపుతున్నామని కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి వీవీ రామరాజు,ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.15 వేలు జీతం కాగా, చేతికి రూ.13,087 వస్తుందని, దాంతో ఏ విధంగా కుటుంబాన్ని పోషించాలని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ విభాగంలో 27 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులు పని చేస్తున్నారని, టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేశారు.. కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.10 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వలన్నారు. గత నెల 30న తమ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామని, స్పందన లేకపోవడంతో సమ్మెలోకి దిగాల్సి వచ్చిందన్నారు. వారంలో తమ సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కాగా వీరి సమ్మెకు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మస్యం చంద్రరావు, మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పులపకూరి రామకృష్ణ, కాటంరెడ్డి ఏసు, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది విధుల బహిష్కరణ

పిఠాపురం: మున్సిపల్ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం నుంచి సిబ్బంది విధులు బహిష్కరించారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన శిబిరాలు ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు, మున్సిపల్ కౌన్సిలర్లు బోను దేవా, పెదపాటి రాజేష్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు రాంబాబు, చెట్టుబత్తిన సురేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ కార్మికుల సర్వీసులు క్రమబద్ధీకరించడం లేదన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెంకె రాంబాబు, మురాలశెట్టి అచ్చిరాజు, కరణం శ్రీను కోవెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.